ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
శనివారం | 31 మే 2025 | 9 పేజీలు




## బుద్ధ విగ్రహం తొలగింపుపై నిరసన




# గుట్కా దందా ఆగేదుందా?

- మాదకద్రవ్యాలపై నిషేధం విధించిన ప్రభుత్వం
- ఉక్కుపాదమా.. తూతూ మంత్రమా..
- మాఫీయాకు కొందమంది ఖాకీల సహకారం!
- కొత్త పంథాలో గుట్కా వ్యాపారం
- బస్సు, రైల్వే, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా గుట్కా చేరవేత..
- రహస్య ప్రాంతాల్లో గోదాంలు
- ఇక్కడి నుండి వివిధ ప్రాంతాలకు బస్తాల తరలింపు
- కొరియర్‌ల ద్వారా రిటైల్ వ్యాపారులకు భారీ మొత్తంలో అందజేత
- గుట్కాకు బానిసలవుతున్న యువత

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

వాణిజ్య పన్నుల శాఖ మామూళ్ల మత్తులో జోగుతోంది. అధికారులు, సిబ్బంది తీరు వల్ల రాష్ట్ర సర్కారు ఖజానాకు భారీగా ఆదాయం గండి పడుతున్నదన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. వాణిజ్య పన్నుల శాఖ ఈ అక్రమ రవా ణాను చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై బహిరంగం గానే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు జోరుగా గుట్కా అక్రమ రవాణా జరుగుతోంది. కర్ణాటక రాష్ట్రంలోని తుమ్కూరు, బీదర్ ప్రాం తాల నుంచి ప్రతి రోజు ఒకటి లేదా రెండు లోడ్ల చొప్పున గుట్కా రవాణా జరుగుతున్నట్టు చెబుతున్నారు. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్ పట్టణాలకు ఈ గుట్కా సరఫరా జరు గుతున్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి వ్యాపారులు ఈ దందాతో కోట్లకు ఎదిగారని, అక్రమ రవాణాను అడ్డుకునే ప్రభుత్వ శాఖల అధికారులను తమ దారిలోకి తెచ్చుకున్నా రన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇక్కడి నుండి జన్నారం, ఉట్నూర్, ఇచ్చోడ, బోథ్, బైంసా, ముధోల్ సహా అన్ని మం డల కేంద్రాలకు, మహారాష్ట్రలోని అప్పారావ్ పేట్, శివుని, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాలకు జోరుగా రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వివరాలు 7లో

## కమిషన్లపైనే శ్రద్ధ

- అభివృద్ధి నిరోధకుడు ఏలేటి
- చెక్‌డ్యామ్‌లో కూల్చివేతపై న్యాయపోరాటం చేస్తాం..
- మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి-4

## నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి






### సొంతింటి కల సాకారమే..

## ప్రజా ప్రభుత్వ లక్ష్యం

పేదోడి సొంతింటి కలను నెరవేరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం సిరికొండ, ఉట్నూర్ మండలంలోని హీరాపూర్ (జే), ఇంద్రవెల్లి మండలం గిన్నెర, గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి భూమి పూజ చేసి, లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ

## పనులు వేగవంతం చేయాలి

నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశ్యంలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండలం టేకులపల్లిలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో పాటు గొల్లగట్టు, కన్నెపల్లి గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను తహసీల్దార్ శ్రావణ్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకర్‌లతో కలిసి సందర్శించారు.







### మంచిర్యాల జిల్లాలో

## ఎమ్మెల్సీ కవిత పర్యటన

- శ్రీరాంపూర్‌లో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళి..
- జర్నలిస్టు మునీర్ కుటుంబానికి పరామర్శ
- కవిత పర్యటనకు బీఆర్ఎస్ నేతలు దూరం
- జాగృతి నేతలను మాత్రమే కలిసిన కవిత



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ
# పనులు వేగవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, మే 30 (ప్రభాత సమాచారం)**

నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశ్యంలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని కన్నెపల్లి మండలం టేకులపల్లిలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో పాటు గొల్లగట్టు, కన్నెపల్లి గ్రామాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను తహశీల్దార్ శ్రావణ్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకర్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితాలో పారదర్శకంగా వ్యవహరించాలని, జాబితాలో అర్హత గల వారి వివరాలు మాత్రమే ఉండాలని తెలిపారు. టేకులపల్లి గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై తగు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సకాలంలో మొక్కలకు నీటిని అందించి జిల్లాలో నాటేందుకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి నిరంతరాయంగా త్రాగునీటిని అందించాలని, మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్లు లేని ప్రాంతాలకు నీటి ట్యాంకులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజలకు మరింత అందుబాటులో మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తూ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. వివిధ ధృవపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి నిబంధనలకు లోబడి ధృవపత్రాలు జారీ చేయాలని తెలిపారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్దిదారుల జాబితా రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని, అనర్హుల వివరాలు జాబితాలో ఉండకూడదన్నారు. నూతన రేషన్ కార్డులు, చేర్పులు, మార్పుల కొరకు అందిన రేషన్కార్డుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల వివరాలతో జాబితా తయారు చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి నిరంతరాయంగా తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓరియంట్ సంఘం ఎన్నికల్లో విక్రమ్ రావును గెలిపించాలి



### విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్ ఎమ్మెల్యేలు వినోద్, వివేక్, వెడ్మ బొజ్జు

**బెల్లంపల్లి, మే 30 (ప్రభాత సమాచారం)**

30 ఏళ్లలో తొలిసారిగా దేవపూర్ సిమెంట్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తున్న పుస్కూరి విక్రమ్ రావును గెలిపించాలని బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్, వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో బరిలో ఉన్న ఐఎన్టీయూసీ అభ్యర్థి విక్రమ్ రావుతో కలిసి శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ సంఘాలు బలపరుస్తున్న విక్రంరావును గెలిపించాలన్నారు. గడ్డం వెంకటస్వామి కుటుంబం తొలినుంచి కార్మికుల పక్షాన నిలబడి పని చేస్తుందని వెల్లడించారు. సింగరేణి కార్మికులకు పింఛన్, ప్రైవేట్ ఫండ్, సాధించిన ఘనత వెంకటస్వామికే ఉందన్నారు. మూతపడే స్థితిలో ఉన్న సింగరేణి సంస్థను దివంగత వెంకటస్వామి కాపాడారన్నారని గుర్తు చేశారు. దేవపూర్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విక్రమ్ రావును గెలిపిస్తే కార్మికుల హక్కులను కాపాడుతామన్నారు. కార్మికుల సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఓరియంట్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయానికి ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఐక్యంగా నిలబడి ఓరియంట్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీసీయూ అభ్యర్థి పుస్కూరి విక్రం రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివాసీ సంఘాలకు పిలుపునిచ్చారు. ఆత్మగౌరవానికి ప్రతీకగా గిరిజన సంఘాలు ఉంటాయన్నారు. ఆదివాసి సంఘాలన్నీ ఒకతాటిపై నిలబడి ఓరియంట్ సిమెంట్ గుర్తింపు సంఘ ఎన్నికల్లో విజయకేతనంలో కీలక భూమిక వహించాలన్నారు.

**అందుబాటులో ఉండి కార్మికులకు సేవ చేస్తా..**

దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో తనను గెలిపిస్తే కార్మికుల సేవకు అంకితమై పని చేస్తానని ఐఎన్టీయూసీ అభ్యర్థి విక్రమ్ రావు హామీ ఇచ్చారు. కార్మికులకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేష్, దావ రమేష్, కంకటి శ్రీనివాస్, రత్నం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



## లబ్దిదారులకు సకాలంలో
# బియ్యం పంపిణీ చేయాలి

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

**మంచిర్యాల, మే 30 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో అర్హులైన లబ్దిదారులకు సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి రేషన్ డీలర్లు, ఈ–పాస్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత అకాల వర్షాల పరిస్థితుల దృష్ట్యా రాబోయే 3 నెలల కాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రేషన్ డీలర్లు చౌకధరల దుకాణాలను సమయానుసారం తెరిచి ఉంచాలని, సమయపాలన ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. గోదాము, ఎం.ఎల్.ఎస్ పాయింట్ నుండి చౌకధరల దుకాణాల వరకు చేరే దాకా ధాన్యం తూకం విలువలో ఎలాంటి తేడాలు ఉండకూదని, చౌకధరల దుకాణాలకు చేరుకున్న ధాన్యం నిల్వలను ఉంచేందుకు సరిపడా స్థలం సిద్దంగా ఉంచుకోవాలని తెలిపారు. రాష్ట్ర, జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తారని, చౌకధరల దుకాణాల డీలర్లు స్టాక్ నిల్వలు, చౌకధరల దుకాణం నంబర్, డీలర్ పేరు, మొబైల్ నంబర్, రేషన్ షాప్ నిర్వహించే సమయం పూర్తి వివరాలతో నోటీస్ బోర్డు ఉండాలని, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, గోనె సంచులు జాగ్రత్తగా నిర్వహించాలని, తూకం యంత్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఇతర నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీర్లు ఈ–పాస్ మిషన్ పని చేసే విధానాన్ని రేషన్ డీలర్లకు వివరించారు. కేటాయించిన ప్రకారం రేషన్ సన్నబియ్యం అర్హులైన ప్రతి లబ్దిదారుడికి అందే విధంగా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు మంచిర్యాలకు
# మంత్రి సీతక్క రాక

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మే 30 (ప్రభాత సమాచారం)**

నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నేడు ఉదయం నిర్వహించనున్న సమావేశానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ–శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క హాజరు కానున్నారని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. వరిధాన్యం కొనుగోలు, వ్యవసాయ అవసరాలు (విత్తనాలు, ఎరువులు), ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి కార్యక్రమాల పురోగతిపై పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా రెవెన్యూ, పౌరసర ఫరాలు, గ్రామీణాభివృద్ధి, సహకార, వ్యవసాయ శాఖ అధికారులు, గృహ నిర్మాణ శాఖల అధికారులు, రాజస్వ మండల అధికారులు తమ శాఖల పురోగతిపై పూర్తి వివరాలతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు





**నిర్మల్, మే 30 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, మందుల విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న అరుణ్ ఏజెన్సీ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా దుకాణంలోని విత్తనాలు, పురుగుమందుల ప్యాకింగ్, లేబుళ్లు, అమ్మకాల రిజిస్టర్లు, నిల్వల వివరాలు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, నకిలీ విత్తనాల కారణంగా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిషేధించిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని, నిబంధనల్ని అతిక్రమించిన వారి మీద చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అధికారులు రెగ్యులర్గా దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నకిలీ విత్తనాల సరఫరా, అమ్మకాలపై కఠినంగా చర్యలు తీసుకుని రైతుల ప్రయోజనాలను కాపాడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీలో వ్యవసాయ అధికారి రాజశేఖర్, తహసిల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## మంచిర్యాల జిల్లాలో
# ఎమ్మెల్సీ కవిత విస్తృత పర్యటన

**మంచిర్యాల, మే 30 (ప్రభాత సమాచారం)**
జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం మంచిర్యాల జిల్లా పర్యటనకు వచ్చారు. ఆకస్మిక షెడ్యూల్‌లో భాగంగా జిల్లాలో పర్యటించారు. ముందుగా శ్రీరాంపూర్‌లో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆమె జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. శ్రీరాంపూర్‌లో బీఆర్‌ఎస్ యూత్ విభాగం నాయకులు కందుల ప్రశాంత్ ఇంటికి వెళ్ళి ఆయన్ని పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి మేరకు ప్రశాంత్‌పై కేసు నమోదు కాగా ఆయన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు కుట్రతో ఎన్ని అక్రమ కేసులు పెట్టినా.. వాటిని ఎదుర్కొంటూ జాగృతి నాయకులను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని గౌతమినగర్‌లో ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు మునీర్ కుటుంబాన్ని కవిత పరామర్శించారు. ముందే నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం స్థానిక పద్మనాయక కళ్యాణ మండపంలో వివాహ వేడుకకు ఆమె హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి హైదరాబాద్ తిరుగు ప్రయాణం అయ్యారు. ఆకస్మిక పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రానికి వచ్చినప్పటికీ ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడక పోవడం విశేషం. ఇటీవల తాజా రాజకీయ పరిణామాలు.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ, కొత్త పార్టీ పెడతారనే ఊహాగానాల మధ్య జిల్లాకు వచ్చిన కవిత కొత్త అంశం ఏదైనా చెబుతారా అని యోచించిన ఫలితం లేకుండా పోయింది.

**'నంబాల' మృతదేహాన్ని ఇవ్వకపోవడం బాధాకరం ...**
జిల్లా పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జర్నలిస్టు మునీర్ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ భావజాలాన్ని బలంగా పాదుగొలిపిన ఘనత మునీర్‌కు ఉందన్నారు. దేశ, రాష్ట్ర సమస్యలను అవలోకనం చేసుకుంటూ చక్కని కథనాలు అందించారని ఆమె చెప్పారు. తెలంగాణా వాదాన్ని వినిపించడంతో పాటు విప్లవోద్యమాల భావజాలాన్ని వ్యాప్తింపజేశారని తెలిపారు. అదేవిధంగా దేశ రాష్ట్ర సమస్యలను ప్రజలకు అందించారని, మునీర్ లాగే మంచిర్యాల జర్నలిస్టులు పని చేయాలని సూచించారు. శాంతి చర్చలకు ప్రతిపాదన చేసిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందితే.. కనీస గౌరవం అనేది లేకుండా ప్రధాన మంత్రి మోడీ అంతిమ సంస్కారాలకు నోచకుండ చేశారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకి ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని కవిత ప్రస్తావించారు. దళిత ఎంపీ అయిన తనకు అవమానం జరిగిందని బాధపడ్డారని తెలిపారు. గతంలో యాదగిరిగుట్ట వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఇలాగే చేశారని చెప్పారు. రేవంత్ రెడ్డి కుటుంబం పైన ఆసనాలలో కూర్చుంటే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కింద కూర్చున్న విషయాన్ని గుర్తు చేశారు.

## మేకను కాపాడుదామని వెళ్లి
# ప్రాణాల మీదికి తెచ్చుకున్న కాపరి

**బోథ్, మే 30 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి దన్నూర్ వెళ్లే దారిలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో ఉన్న లోతైన బావిలోకి దిగి ఓ మేకల కాపరి చిక్కుకుపోయిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం మధ్యాహ్నం పశువుల కాపరి మేకలను మేపుతూ ఉండగా ఒక మేక మేత మేస్తూ దాదాపు 50 ఫిట్ల లోతైన బావిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. ఇది గమనించిన పశువుల కాపరి మేకను రక్షించాలని లోతైన బావిలోకి తన సహచరుడికి చెప్పి తాడు సహాయంతో లోపలికి దిగాడు. బావి బయట ఉన్న వ్యక్తి తాడు సహాయంతో మేకను బయటకు తీసుకున్నాడు. కానీ మేకను రక్షించడానికి బావిలోకి దిగిన వ్యక్తి బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికులు అందరూ కలిసి తాళ్ల సహాయంతో బావిలోకి దిగిన వ్యక్తిని బయటకు తీశారు.



## సమ్మక్క సారక్కలను దర్శించుకున్న
# మాజీ ఎంపీ సోయం బాపురావ్



**ఆదిలాబాద్, మే 30 (ప్రభాత సమాచారం)**
మేడారం సమ్మక్క-సారక్క అమ్మవారిని శుక్రవారం మాజీ ఎంపీ సోయం బాపూరావు దర్శించుకున్నారు. అంతకు ముందుగా భద్రాచలంలోని సీతారాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న సోయం బాపురావుకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మేడారంలో సమ్మక్క సారక్కలకు మాజీ ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నంది రెడ్డి తదితరులు ఉన్నారు.

# అవశేషాల కోసమే పులిని హతమార్చారు : డీఎఫ్ వో నీరజ్ కుమార్

**ఆసిఫాబాద్, మే 30 (ప్రభాత సమాచారం)**
పులి అవశేషాల కోసమే పులిని వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చి హతమార్చారని డీఎఫ్‌వో నీరజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచికల్‌పేట్ ఏలూరు అటవీ ప్రాంతంలో 15 రోజుల క్రితం పులిని హతమార్చడానికి ఆరు గురు వేటగాళ్లు ఆ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి పులిని హతమార్చారు. పులి చనిపోయిన తర్వాత అక్కడి నుంచి వేరేచోటకు తీసుకెళ్లి పులి చర్మం, మీసం, గోళ్ళు, దంతాలను తీశారని తెలిపారు. దానికి మిగతా వారు సహకరించారని చెప్పారు. గతంలో కూడా ఇలాగే విద్యుత్ తీగలు అమర్చి ఓ జింక, నీలాగాయి ని హతమార్చారన్నారు. పులి హతమార్చిన కేసులో ఇప్పటికే 32 మందిని రిమాండ్ పంపించగా మరో ఇద్దరు పరారీలో



ఉన్నారని తెలిపారు. అక్రమంగా విద్యుత్ ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరామన్నారు. వేటగాళ్ల పై అటవీ అధికారుల నిఘా ఉందని, వన్యప్రాణులకు హాని కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో హెచ్చరించారు.



## ప్రభుత్వ భూములు ఆక్రమణలపై
# జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు

**నిర్మల్, మే 30 (ప్రభాత సమాచారం)**
ముధోల్ మండలం బోరిగాం గ్రామంలోని సర్వే నంబరు 249లో ఇటీవల కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించేందుకు యత్నించిన విషయం వెలుగులోకి రావటంతో ఈ సమాచారాన్ని అందుకున్న రెవెన్యూ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, సంబంధిత భూమి హద్దులను గుర్తించటం జరిగింది. అని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆక్రమణలను తొలగిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. బోరిగాం ఘటన నేపథ్యంలో రెవెన్యూ, ల్యాండ్ సర్వే విభాగాలకు చెందిన అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని జిల్లా యంత్రాంగం నియమించిందిని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఆ కమిటీ విచారణ కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు చోటుచేసుకోకుండా నివారించేలా జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. అయితే ఈ వ్యవహారంలో కొంతమంది వ్యక్తులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అసత్య ప్రచారాలు, పుకార్లు వ్యాప్తి చేయడానికి యత్నిస్తున్నట్లు గుర్తించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఎవరు అసత్య ప్రచారాలు, పుకార్లను నమ్మవద్దుఅని కలెక్టర్ కోరారు. బోరిగాం గ్రామ ప్రజలందరికీ జిల్లా యంత్రాంగం పూర్తి అండగా నిలుస్తోందని తెలిపారు. ఎక్కడా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**ఆదిలాబాద్, మే 30 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదుట పాత జాతీయ రహదారిపై శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న ఆటో- ట్రాక్టర్ వేగంగా ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఖలీల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది రిమ్స్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కాగా మృతుడు ఖానాపూర్ కాలనీవాసిగా గుర్తించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మే 30 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. రోడ్లు భవనాల శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ వి. అశోక్ కుమార్ సేవలు జిల్లాలో గుర్తుండిపోయేలా ఉన్నాయన్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ ఒక సహజమైన ఘట్టమని, అయితే వారు అందించిన సేవలు మాత్రం ప్రజల మనసుల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా అభివృద్ధిలో అశోక్ కుమార్ ముఖ్య భూమిక పోషించారని, జిల్లా కొత్త కలెక్టరేట్ భవనం నిర్మాణంలో కీలక పాత్ర పోషించినట్టు గుర్తుచేశారు. అలాగే జిల్లాలో నిర్వహించిన వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు వేదికలు సిద్ధం చేయడం, నిర్మల్ ఉత్సవాల విజయవంతానికి చేయూతనివ్వడం ప్రశంసనీయమ న్నారు. భావి జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు కూడా తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ, అశోక్ కుమార్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన సేవల్ని




స్మరించుకుంటూ శేష జీవితం ఆరోగ్యంగా సాగాలని కోరారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన పంచాయతీ రాజ్ శాఖ ఈఈ శంకరయ్యను కూడా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, సిపిఓ జీవరత్నం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో భారీగా అక్రమాలు

- ధాన్యం కొనుగోళ్లలో ఎమ్మెల్యేకు కమిషన్లు
- నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడింది
- ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్ పనుల ఊసే లేదు
- మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



**నిర్మల్, మే 30 (ప్రభాత సమాచారం)**

ధాన్యం కొనుగోలు లో జరిగే అక్రమాల నుంచి ఎమ్మెల్యేకు ముడుపులు ముడుతున్నాయని మాజీ అటవీ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా ధాన్యాన్ని తరలించే ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్ట్ పొందిన వ్యక్తికి ఒక లారీ కూడా లేదని అలాంటి వ్యక్తికి టెండర్ అప్ప చెప్పారని ధ్వజమెత్తారు. గతంలో తరుగు పేరిట 41 కేజీలు మాత్రమే తూకం వేయగా ప్రస్తుతం 45 కిలోల ధాన్యాన్ని తూకం వేస్తున్నారని మండిపడ్డారు. రైతుల వద్ద దోచుకుంటున్న డబ్బులన్నీ ఎమ్మెల్యేకు ముడుపుల రూపంలో ముడుతున్నాయని విమర్శించారు. నిర్మల్ జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఎమ్మెల్యే ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారన్నారు. ఫ్యాక్టరీని అడ్డుకుంటున్న ఎమ్మెల్యేకు ఆయిల్ ఫామ్ గెలలను ముట్టే అర్హత కూడా లేదన్నారు. ముధోల్, నిర్మల్ ఎమ్మెల్యేలు కుమ్మక్కై తమ సన్నిహితుడిని ఇరిగేషన్ డిఈగా నియమించుకున్నారని, ఆయన కన్నా 20 మంది సీనియర్లు ఉన్నప్పటికీ వారిని పక్కన పెట్టి అక్రమ పద్ధతిలో పోస్టింగ్ ఇప్పించారని దుయ్యబట్టారు. ఇరిగేషన్ డిఈ ఆ ఎమ్మెల్యేల అడుగుజాడల్లో నడుస్తున్నారని మండిపడ్డారు. నిర్మల్ మండలంలోని సిద్ధాపూర్ వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ ను ధ్వంసం చేయడం అవివేకమన్నారు. చెక్ డ్యామ్ నిర్మాణాల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, ముందస్తు ప్రభుత్వ అనుమతి లేకుండా చెక్ డ్యామ్ ను ధ్వంసం చేయడం అవివేకమన్నారు. స్వర్ణ వాగులో నీటిని విడుదల చేయకుండా అడ్డుకుంటున్నారని, చెక్ డ్యామ్ కూల్చివేతపైన, స్వర్ణ వాగులో నీటిని విడుదల చేయకుండా జాప్యం చేయడంపై తాను హైకోర్టును ఆశ్రయిస్తానన్నారు. ఎమ్మెల్యేగా మహేశ్వర్ రెడ్డి గెలిచి 15 నెలలు గడిచినప్పటికీ ఇప్పటివరకు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు లేవన్నారు. గతంలో తాను మంత్రిగా మంజూరు చేయించిన పనులకే ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసి తన సొంత డబ్బా కొట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు. నిర్మల్ పట్టణం పూర్తిగా అధ్వానంగా మారిందని ఇక్కడి ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాను అమృత్ 2 పథకం కింద 62 కోట్ల రూపాయలను మంజూరు చేయించానని, ఆ పనులను ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అడ్డుకుంటున్నారన్నారు. ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్ పనులకు సంబంధించిన ఊసే లేదన్నారు. జిల్లాలో జరిగిన జొన్నల కొనుగోళ్ల వ్యవహారంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జొన్న పంట సాగు తక్కువగా ఉన్నప్పటికీ పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి అక్రమంగా వచ్చిన జొన్నలను కొనుగోలు చేశారని ఆరోపించారు. జిల్లాలో ఎమ్మెల్యే అండదండలతో పెద్ద ఎత్తున అక్రమ ఇసుక దందా కొనసాగుతుందని ఈ దందాలో ఎమ్మెల్యేకు హస్తముందని ఆరోపించారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు మహేశ్వర్ రెడ్డి వారం రోజులకు ఒకసారి నిర్మల్‌కు వచ్చి సండే ఎమ్మెల్యేగా ముద్రపడ్డారని, ప్రస్తుతం నెలకోసారి నిర్మల్ నియోజకవర్గానికి వస్తూ మంత్లీ ఎమ్మెల్యేగా మారిపోయారన్నారు. విలేకరుల సమావేశంలో ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ రాజేందర్, బనసపల్లి పిఎసిఎస్ చైర్మన్ రమణారెడ్డి, డిసిసిబి డైరెక్టర్ రఘునందన్ రెడ్డి, అప్పాల మహేష్, సారంగాపూర్ మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, లక్ష్మణచందా మాజీ జెడ్పీటీసీ సభ్యులు రాజేశ్వర్, శ్రీకాంత్ యాదవ్, మేడారం ప్రదీప్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధి హామీ కూలీ పెంచాలి

**నిర్మల్, మే 30 (ప్రభాత సమాచారం)**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కూలి రేట్లు 600 నుంచి 1200కు పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, నరసయ్య తదితరులు మాట్లాడుతూ... ఉపాధి హామీ పనుల్లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని, రోజుకూలి రూ.600 చెల్లించాలని సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీల, ఫీల్డ్ అసిస్టెంట్‌ల ఇతర సిబ్బంది పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, కూలీలకు గడ్డపార, తట్ట, పారా పనిముట్లు కొనుగోలు చేసి ఇవ్వాలి. ఉపాధి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని, ఉదయం, సాయంత్రం ఫొటోలు తీసి పంపాలనే నిబంధనలను తొలగించాలన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**బెల్లంపల్లి, మే 30 (ప్రభాత సమాచారం)**

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో శాంతి గనిలో కార్మికులు, ఐఎన్‌టియూసీ నాయకులు కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు కార్మికులకు మరిన్ని సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి కుక్కల. ఓదెలు, నాయకులు కస్తూరి కనకయ్య దేవా రమేష్, మొండి, వెంకటేష్, సుమన్ శ్యామ్, మాధవరెడ్డి, బండి శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## క్షుద్ర పూజల పేరుతో మహిళతో అసభ్య ప్రవర్తన

**ఆదిలాబాద్, మే 30 (ప్రభాత సమాచారం)**




క్షుద్ర పూజల పేరుతో మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన మాంత్రికుడిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో క్షుద్రపూజలతో నయమవుతుందని ఓ వ్యక్తి సలహా ఇవ్వడంతో ఆమె కుటుంబ సభ్యులు మహారాష్ట్రకు చెందిన అభినయ్ కుమార్ అనే మాంత్రికుడిని తీసుకొచ్చి పూజ చేయించారు. పూజ చేస్తుండగా ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో సదరు మహిళ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి మాంత్రికుడిని అరెస్టు చేశారు. ప్రజలు ఆధునిక సమాజంలో మంత్రతంత్రాలు నమ్మవద్దని ఎలాంటి సమస్యలు ఉన్న వైద్యుల వద్దకు వెళ్లాలని డీఎస్పీ సూచించారు. మూఢనమ్మకాలను నమ్మిమోసపోద్దని, ఆధునిక కాలంలో మంత్రాలతో వ్యాధులు నయంకావని ప్రజలు గ్రహించాలన్నారు. ముఖ్యంగా బాబాలు, మంత్రాల ద్వారా సమస్యల పరిష్కారం కాదని స్పష్టం చేశారు. ప్రజలందరూ వాటిని నమ్మవద్దని సూచించారు. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## బాల్యవివాహాలు చేస్తే నాన్ బెయిలెబుల్ కేసులు



**పెంచికల్‌పేట, మే 30 (ప్రభాత సమాచారం)**

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీవో బుర్ల మహేష్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చెడ్వాయి కొత్తగూడెం గ్రామానికి చెందిన మైనర్ బాలికకు బాల్య వివాహం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు గ్రామాన్ని సందర్శించి బంధువులు, కుటుంబ సభ్యులు, కుల పెద్దలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం వల్ల ఎదురయ్యే నష్టాలను, కేసుల ద్వారా ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని బాల్య వివాహాలు చేస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తున్నామని వెల్లడించారు. అంతే కాకుండా నాన్‌బెయిలెబుల్ కేసులను నమోదు చేస్తామని తెలిపారు. 2030 వరకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన బాల్య వివాహరహిత భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లు దృష్టికి వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098, 112లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ రవళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, కానిస్టేబుల్ సురేష్, సాయిలత పాల్గొన్నారు.



## డీలర్లకు ఈ-పాస్ మిషన్లు అందజేత

**మంచిర్యాల, మే 30 (ప్రభాత సమాచారం)**

ఎరువులు పంపిణీ చేసేందుకు ఉపయోగించే ఈ-పాస్ నూతన మిషిన్లను జిల్లా వ్యవసాయ అధికారి కల్పన డీలర్లకు అందజేశారు. శుక్రవారం నస్పూర్ మండలంలోని సీతారాంపల్లిలోని రైతు వేదికలో మంచిర్యాల వ్యవసాయ డివిజన్ పరిధిలోని నస్పూర్, మంచిర్యాల, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లోని ఎరువుల దుకాణ డీలర్లకు నిర్వహించిన సమావేశంలో డీఏఓ మాట్లాడారు. రైతులకు ఎరువులను సకాలంలో అందేటట్లు నిల్వలు ఉంచుకోవాలని సూచించారు. రైతు వ్యవసాయ భూమి ఆధారంగా ఎరువులను ఇవ్వాలని, అతిగా ఎరువులు వాడడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించాలన్నారు. అనంతరం డీలర్లకు విజన్‌టెక్ సంస్థ ఈ-పాస్ ఎల్-1 కొత్త మెషీన్‌లను స్పిక్ ఫెర్టిలైజర్ కంపెనీ ఆధ్వర్యంలో డిఏఓ కల్పన చేతుల మీదుగా అందజేశారు. కొత్త మిషన్ ఎలా ఉపయోగించాలో డీలర్లకు అవగాహన కల్పించారు. రైతులకు అందజేసే ఎరువులను కొత్త ఈపాస్ మిషన్ లో రైతు ఆధార్ కార్డు ఆధారంతో వ్యవసాయ భూమి, పంటల వారీగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంచిర్యాల డివిజన్ అధికారి (ఏడిఏ) అనిత, టెక్నికల్ ఏవో కొంక శ్రీనివాస్, డివిజన్ లోని వ్యవసాయ అధికారులు కృష్ణ (హాజీపూర్), శ్రీకాంత్ (లక్షెట్టిపేట), స్పిక్‌కంపెనీ ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ఇచ్చోడ, మే 30 (ప్రభాత సమాచారం)**

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పే దింటి ఆడ బిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వరంలాంటిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం కూడా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు సుభాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు

## చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**మంచిర్యాల, మే 30 (ప్రభాత సమాచారం)**
నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్దిదారులకు పట్టాలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండలం షెట్పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని శివ్వారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, కుందారం, నర్సింగాపూర్, షెట్పల్లి, బెజ్జాల గ్రామాల ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్దిదారులకు చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వివేకానంద, గృహ నిర్మాణశాఖ పి.డి. బన్సీలాల్, తహశిల్దార్ వనజారెడ్డి లతో కలిసి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జైపూర్ మండలంలో 588 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా మండలం లోని బెజ్జాలలో 16 మంది, కిష్టాపూర్లో 21 మంది, కుందారంలో 41 మంది, నర్సింగాపూర్లో 15 మంది, పౌనూర్ లో 24 మంది, షెట్పల్లిలో 34 మంది, శివ్వారంలో 25 మంది, వేలాలలో 22 మంది మొత్తం 198 మంది లబ్దిదారులకు పట్టాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు కావడం జరిగిందని, పైలెట్ ప్రాజెక్టు చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం విడతల వారిగా కొనసాగుతుందని, అర్హత గల ప్రతి ఒక్కరికి పథకం ఫలాలు అందుతాయని తెలిపారు. 2వ విడతలో సొంత ఇంటి స్థలం కలిగి ఉండి పథకం కొరకు అందిన దరఖాస్తులను కమిటీ ద్వారా పరిశీలించి అర్హులైన నిరుపేదలను ఎంపిక చేసి ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందన్నారు. పథకం మంజూరైన లబ్దిదారులు వెంటనే నిర్మాణం చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుకను అవసరం మేరకు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అర్హత కలిగి ఉండి పథకానికి ఎంపిక కాని అభ్యర్థులు పూర్తి వివరాలతో తమ దృష్టికి తీసుకువస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొని ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



### ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో

# పదవీ విరమణ తప్పనిసరి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మే 30 (ప్రభాత సమాచారం)**
ప్రజలతో మమేకమై సేవలు అందించే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులుగా పని చేస్తూ పని చేస్తూ ఈ నెల 31వ తేదీ పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో పోటు రవీందర్రెడ్డి దంపతులను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా అధికారులతో శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోటు రవీందర్రెడ్డి విధులలో నిబద్ధతతో సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని, పదవీ విరమణ పొందిన అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ బస్టాండ్ అభివృద్ధికి ప్రణాళికలు

### ఆర్టీసి నిర్మల్ డిపో మేనేజర్ పండరి



**ఖానాపూర్, మే 30 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ప్రణాళికలు ప్రతిపాదనలు చేస్తున్నట్లు నిర్మల్ డిపో మేనేజర్ పండరి అన్నారు. శుక్రవారం ఆయన ఖానాపూర్ బస్టాండ్ ను పరిశీలించారు. ప్రైవేట్ వాహనాలను క్రమబద్ధీకరించేందుకు పోలీసులతో చర్చించామని దాంతోపాటు కాంపౌండ్ వాల్ నిర్మాణం, మరుగుదొడ్లలో పూర్తిస్థాయి వసతులు కల్పిస్తామన్నారు. బస్టాండ్ లోపల ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ను మరమ్మతులు చేపట్టి, మిగిలిన షాపులకు టెండర్లు పిలిస్తామని అన్నారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఈ టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. దాంతోపాటు ఖానాపూర్ నుంచి సాయంకాలం శంషాబాద్కు ఉన్న బస్సు సర్వీస్ను కడెంకు పొడిగించే ప్రతిపాదన చేస్తామని అన్నారు. దాంతోపాటు తెల్లవారుజామున 5:15 హైదరాబాద్ బస్సును పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని అన్నారు .ఆయనతోపాటు ఆర్టీసీ ఇంజనీర్ అధికారులు, కంట్రోలర్ పోశెట్టి ఉన్నారు.

# అటవీ అధికారులపై చర్య తీసుకోవాలి



**బెల్లంపల్లి, మే 30 (ప్రభాత సమాచారం)**
వేమనపల్లి మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపిన అధికారులపై చర్య తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రైతులతో కలిసి బెల్లంపల్లి ఆర్డీఓ కార్యాలయం ఇన్చార్జి డిప్యూటీ తహసీల్దార్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యాభై సంవత్సరాల నుండి రైతులు చామనపల్లి శివారులోనీ సర్వే నెంబర్ 65, 67 లో సాగు చేస్తున్నారని అన్నారు. గత సంవత్సరం నుండి అటవీశాఖ అధికారులు ఈ భూములు అటవీ శాఖకు చెందినవని రైతులపై దాడులు చేస్తూ, అక్రమంగా కేసులు నమోదు చేసి రైతులను జైలుకు పంపించారని ఆరోపించారు. అటవీశాఖ అధికారుల పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారులు రైతుల భూముల్లో రావద్దని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ పోలీసులు అటవీశాఖ అధికారులపై కేసు నమోదు చేయలేదన్నారు.



# న్యాయవాద గుమస్తాలకు బీమా

**ఆదిలాబాద్, మే 30 (ప్రభాత సమాచారం)**
పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది బిపిన్ కుమార్ పటేల్ పుట్టిన రోజు సందర్భంగా న్యాయవాద గుమస్తాలకు ఆరోగ్య బీమా చేసి ఉదారతను చాటారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలోని గుమస్తాల కార్యాలయంలో వారితో కలిసి కేక్ కట్ చేసి జన్మదినాన్ని వేడుకగా జరుపుకున్నారు. అనంతరం ఆయన గుమస్తాలకు ఆరోగ్య బీమా బాండ్లను అందజేశారు. పలువురు న్యాయవాదులు, గుమస్తాలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. జిల్లా కోర్టులో రికార్డు అసిస్టెంట్గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సమద్ను సత్కరించారు. ఆరోగ్య బీమా బాండ్లను అందించడం పట్ల న్యాయవాదుల గుమస్తాలు బిపిన్ కుమార్కు ధన్యవాదలు తెలిపారు.

# తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

**సారంగాపూర్, మే 30 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం, అధికారుల అలసత్వం అసమర్థత వల్లనే వరి ధాన్యం రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రాంకిషన్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలో వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తడిసిన ధాన్యంను కొనుగోలు చేస్తామని చెబుతున్నా స్థానికంగా అందుకు విరుద్ధంగా కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. తేమ నిబంధన శాతాన్ని ఎత్తివేయాలని, రైతులకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోసారంగపూర్ మండల నాయకులు పాల్గొన్నారు.



# మంచిర్యాల జిల్లాలో రైతుల ఖాతాలలో రూ.271 కోట్ల జమ

**మంచిర్యాల, మే 30 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 25 వేల 280 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 77 వేల 465 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 271 కోట్ల 53 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం



జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 216 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందన్నారు. ప్రతీ రోజు రూ.5కోట్ల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు.

# బుద్ధ విగ్రహం తొలగింపుపై నిరసన

**భైంసా-బాసర జాతీయ రహదారిపై అంబేద్కర్‌వాదుల ఆందోళన - బోరిగాం ఘటనపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్**








**ముథోల్, మే 30 (ప్రభాత సమాచారం)**
ముథోల్ మండలం బోరిగాం గ్రామంలో ఇటీవల బుద్ధుని విగ్రహం తొలగింపు ఘటనపై దళిత సంఘాలు, అంబేద్కర్ వాదులు నిరసన వ్యక్తం చేశారు. న్యాయం కోరుతూ శుక్రవారం ముథోల్ మండల కేంద్రంలో భైంసా-బాసర జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు నిరసనలో పాల్గొన్నారు. రాస్తారోకో కారణంగా జాతీయ రహదారిపై సుమారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. బుద్ధుని విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు కలెక్టర్ హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సుమారు 5 గంటలపాటు ఆందోళన చేశారు. ప్రభుత్వ స్థలంలో ప్రతిష్టించిన బుద్ధుని విగ్రహంపై దాడులు జరగడం బాధించిందని పేర్కొన్నారు. న్యాయం చేయాల్సిన అధికారులు మొండి వైఖరి అవలంబిస్తున్నారన్నారు.

**అధికారుల హామీతో..**

ఎస్పీ జానకీ షర్మిల శాంతియుతంగా చర్యలు చేపడతామని చెప్పినా నిరసనకారులు కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ కోరారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్కతో చర్చలు జరిపారు. మంత్రి సంబంధిత అధికారులకు బుద్ధ విగ్రహం పునఃప్రతిష్టకు స్థలం కేటాయించాలని ఆదేశించారని విఠల్‌రెడ్డి, ఆర్డీవో కోమల్‌రెడ్డి తెలిపారు. రాబోయే సోమవారం బుద్ధ విగ్రహం ఆవిష్కరణ, బౌద్ధ పతాక ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని, ప్రభుత్వమే కాంస్య విగ్రహం నిర్మించి అందిస్తుందని హామీ ఇచ్చారు.

**పోలీసుల నిఘా..**

మండలంలోని బోరిగాం గ్రామంలో ఉద్రిక్తతల దృష్ట్యా శుక్రవారం పోలీసులు నిఘా పటిష్టం చేశారు. దళిత సంఘాలు శుక్రవారం చలో బోరిగాంకు పిలుపునిచ్చారు. దీంతో ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు భైంసా ఏఎస్పీ అవినాష్కుమార్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ఉపేంద్రారెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల నుంచి దళిత నాయకులు అధిక సంఖ్యలో తరలివస్తారని సమాచారం మేరకు ఉదయం నుండే పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. తనిఖీలు నిర్వహించారు. 150 మంది పోలీసు సిబ్బందితో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. బందోబస్తును ఎస్పీ జానకీషర్మిల పర్యవేక్షించారు. గ్రామంలో ఉండి భద్రతను స్వయంగా పర్యవేక్షించారు. అంవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.



## తూం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

### కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, మే 30 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ఏర్పాటు చేసిన కొను గోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకా రం రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం కౌటాల మండలం సాండ్ గాం, సిర్పూర్ టి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి సందర్శించి కొనుగో లు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించా లని తెలిపారు. మిల్లుకు వచ్చిన వాహనాల నుండి ధాన్యాన్ని తక్షణమే దిగుమతి చేసుకొని వాహనాలను తిరిగి పంపించే విధంగా సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారా వు, తహసిల్దార్ ప్రమోద్, ఐకెపి ఏపిఎం ముక్తేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి



**నిర్మల్, మే 30 (ప్రభాత సమాచారం)**
తలిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జిల్లా ఇన్చార్జ్ విద్యాశాఖ అధికారి ముదారపు పరమేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సోన్ మండలంలోని వెల్మల్ బొప్పాయి ఉన్నత పాఠశాలలో జరిగిన పోషకుల ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించబడుతున్నదని తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో ఇంగ్లీష్ మీడి యం లో కూడా బోధనాలు జరుగుతున్నాయని అన్నారు. అన్ని పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మౌలిక వసతులు సమకూర్చబడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలతో పాటు డిజిటల్ తరగతి గదులు ,లైబ్రరీ, ల్యాబ్‌లు కలవని తెలిపారు. ప్రతి ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ విద్య కూడా విద్యార్థులకు అందుబాటులో కలదని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన ద్వారా ప్రాథమిక తరగతి నుండి విద్యార్థులకు కంప్యూటర్ జ్ఞానాన్ని అందిస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో గ్రామస్తులు తమ పిల్లల్ని చేర్పించి ప్రభుత్వ బడులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గోదావరి పాల్గొన్నారు.

## శిక్షణలోని అంశాలను తరగతి గదుల్లో అమలు చేయాలి



**ఆదిలాబాద్, మే 30 (ప్రభాత సమాచారం)**
ఉపాధ్యాయులు శిక్షణా కాలంలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో పాటిస్తూ నాణ్యమైన విద్యా బోధన జరిగేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని హిందీ హైస్కూల్లో గురువారం జరిగిన హిందీ భాష టి.ఎల్.ఎం మేళా ను డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండో విడత ఐదు రోజుల పాటు జరిగిన హిందీ ఉపాధ్యాయ శిక్షణలో భాగంగా ప్రతిభ కనబరిచిన హిందీ ఉపాధ్యాయులకు డీఈఓ ప్రతిభ పురస్కారాలను అందించారు. టిఎల్ఎంలో ప్రథమ బహుమతి జైనథ్, ద్వితీయ బహుమతి ఆదిలాబాద్ రూరల్, తృతీయ బహుమతి సాత్నాల మండలాల ఉపాధ్యాయులు అందుకోగా, ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను పరిశీలించారు.



## కేసుల నమోదులో జాప్యం వద్దు

**ఆదిలాబాద్, మే 30 (ప్రభాత సమాచారం)**
కేసుల నమోదులో ఎలాంటి జాప్యం వహించరాదని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాలో గత నెలలో జరిగిన నేరాలపై, గతంలో జరిగిన కేసుల వివరాలు వాటి పురోగతిని తెలుసుకునేందుకు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఒక్క కేసు దర్యాప్తు వివరాలను సంబంధిత పోలీసు అధికారులకు అడిగి క్షుణ్ణంగా పరిశీలించారు. రానున్నది వర్షాకాలం. ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ప్రతి ఒక్క సిబ్బంది అప్రమత్తమై పోలీస్ స్టేషన్ నందు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలీసు వాహనాలలో అత్యవసర సామాగ్రిని కలిగి ఉండాలని, వాగులు వంకలు బ్రిడ్జిలను దాటి ప్రవహిస్తున్నప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రైతులు మోసపోకుండా నకిలీ విత్తనాలను చలామణిలో లేకుండా కఠినమైన చర్యలను తీసుకోవాలని తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అక్రమ పశువుల రవాణా జరగకుండా చూడాలని, ఏర్పాటు చేసిన చెక్ పోస్టలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని కోరారు. సరైన పత్రాలు, అనుమతులు లేకుండా పశువుల రవాణా జరగకుండా ఆపాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, అదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, స్వామి, సీఐలు బి సునీల్ కుమార్, సీహెచ్ కరుణాకర్ రావు, కె ఫణిదర్, ఎ వెంకటేశ్వరరావు, పండే రావు, గుణవంత్ రావు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్, బి శ్రీపాల్, ఆదిలాబాద్ సబ్ డివిజన్ ఎస్సైలు, ఐటీ కోర్, డీసీఆర్‌బీ, కమ్యూనికేషన్, పీసీఆర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఉమ్మడి జిల్లాలో జోరుగా గుట్కా దందా

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**
వాణిజ్య పన్నుల శాఖ మామూళ్ల మత్తులో జోగుతోంది. అధికారులు, సిబ్బంది తీరు వల్ల రాష్ట్ర సర్కారు ఖజానాకు భారీగా ఆదాయం గండి పడుతున్నదన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. వాణిజ్య పన్నుల శాఖ ఈ అక్రమ రవాణాను చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై బహిరంగంగానే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**జోరుగా గుట్కా అక్రమ రవాణా..?**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు జోరుగా గుట్కా అక్రమ రవాణా జరుగుతోంది. కర్ణాటక రాష్ట్రంలోని తుమ్కూరు, బీదర్ ప్రాంతాల నుంచి ప్రతి రోజు ఒకటి లేదా రెండు లోడ్ల చొప్పున గుట్కా రవాణా జరుగుతున్నట్టు చెబుతున్నారు. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్ పట్టణాలకు ఈ గుట్కా సరఫరా జరుగుతున్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి వ్యాపారులు ఈ దందాతో కోట్లకు ఎదిగారని, అక్రమ రవాణాను అడ్డుకునే ప్రభుత్వ శాఖల అధికారులను తమ దారిలోకి తెచ్చుకున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇక్కడి నుండి జన్నారం, ఉట్నూర్, ఇచ్చోడ, బోథ్, భైంసా, ముథోల్ సహా అన్ని మండల కేంద్రాలకు, మహారాష్ట్రలోని అప్పారావ్ పేట్, శివుని, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాలకు జోరుగా రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కర్ణాటక రాష్ట్రంలోని తుమ్కూరు బీదర్ ప్రాంతాల నుండి అక్రమంగా తరలిస్తున్న గుట్కా వ్యాపారం వెనుక పెద్ద మొత్తంలో వాణిజ్య పన్నులు ఎగవేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి లోడు తెస్తే అందులో వంద నుంచి 150 బస్తాల గుట్కా రవాణా చేస్తున్నారని, రసీదులు మాత్రం 50 బ్యాగులకే చెల్లిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతున్నదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో వాణిజ్య పన్నుల శాఖ ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే రాష్ట్ర ఖజానాకు చిల్లు పడుతోందని చెబుతున్నారు. పెద్ద మొత్తంలో అక్రమ రవాణాతో పాటు, సర్కారు ఖజానాకు చిల్లు పెడుతున్న భారీ రాకెట్‌పై యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తెలుగమ్మాయి టాలెంట్



ఆరడుగుల అందగత్తె ఫరియా అబ్దుల్లా టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అందం, నటనతో పాటూ అమ్మడికి అన్ని విషయాల్లోనూ టాలెంట్ ఉంది. తాజాగా గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ 2024లో ఫరియా స్పెషల్ జ్యూరీలో అవార్డు దక్కించుకుంది. ఈ విషయాన్ని జ్యూరీ వెల్లడించగానే ఫరియా ఎంతో ఎమోషనల్ అవుతూ సోషల్ మీడియాలో తన ఆనందాన్ని పంచుకుంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా రాష్ట్ర చలనచిత్ర అవార్డుల విజేతలను అనౌన్స్ చేసింది. ప్రముఖ విప్లవ గాయకుడు గద్దర్ జ్ఞాపకార్థంగా తెలంగాణ ప్రభుత్వం అతని పేరుని ఈ అవార్డులకు పెట్టింది. సినీ ఇండస్ట్రీలోని కొత్త టాలెంట్ ను గౌరవించడమే లక్ష్యంగా ఈ అవార్డుల వేడుక జూన్ 14న హైదరాబాద్ లో ఎంతో ఘనంగా సెలబ్రిటీల మధ్య జరగనుంది. అయితే అవార్డు విజేతల్లో మత్తు వదలరా2 లో ఫరియా పాడిన నక్కో మామా అనే ర్యాప్ సాంగ్ కు అవార్డు దక్కింది. మత్తు వదలరా2 సర్‌ప్రైజింగ్ బ్లాక్ బస్టర్ గా నిలవగా, ఆమె పాడిన ఈ ర్యాప్ సాంగ్ ఓ స్పెషల్ సాంగ్ గా మారింది. ఈ విషయంలో ఫరియా తన సంతోషాన్ని షేర్ చేసుకుంటూ ఈ అవార్డు వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని, ఈ అవార్డు ఇచ్చినందుకు గద్దర్ అవార్డుల జ్యూరీకి ధన్యవాదాలని, దీనికి కారణమైన మత్తువదలరా2 టీమ్ కు డైరెక్టర్ రితేష్ రాణాకు, మ్యూజిక్ డైరెక్టర్ కాలభైరవకు థ్యాంక్స్ చెప్పింది. ఈ అవార్డు వచ్చాక అందరి దృష్టి ఫరియాపై ఉన్నప్పటికీ ఆమె మాత్రం చాలా వినమ్రంగా ఉంటూనే కేవలం సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ద్వారా తన ఆనందాన్ని షేర్ చేసుకుంది. ఈ నోట్ లో తనతో పాటూ అవార్డులు వచ్చిన మిగిలిన విజేతలకు కూడా ఆమె కంగ్రాట్యులేషన్స్ చెప్పగా, ఇలాంటి అవార్డులు ఆర్టిస్టుల నుంచి ఇంకా బెస్ట్ వర్క్ ను బయటకు తీసుకొస్తాయని చెప్పింది.



## డబ్బింగ్ చెప్పడంలో పవర్ స్టార్ కొత్త రికార్డ్..

పవన్ కళ్యాణ్ ఓ వైపు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తూనే.. మరోవైపు తాను ఇప్పటికీ ఒప్పుకున్న సినిమాలను పూర్తి చేయడానికి తీరక లేకుండా శ్రమిస్తున్నారు. తాజాగా హరిహరవీరమల్లు సినిమాకు సంబంధించిన డబ్బింగ్ ఒక్క రాత్రిలో, కేవలం నాలుగు గంటల్లో పూర్తి చేశారు.రాత్రి 10 గంటల వరకు 'ఓజీ' షూటింగ్ ముగించుకొని.. ఆ తర్వాత మళ్ళీ హరిహరవీరమల్లు డబ్బింగ్ కోసం స్టూడియోకు వెళ్లారట. ఈ విషయాన్ని మేకర్స్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. దీంతో నెటిజన్లు ఆయనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమా పట్ల ఆయన కమిట్మెంట్, డెడికేషన్ కి ఫిదా అవుతున్నారు. కేవలం నాలుగు గంటల్లో సినిమా మొత్తం డబ్బింగ్ పూర్తి చేయడం పవన్ కొత్త రికార్డ్ అనే చెప్పొచ్చు. పవన్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'హరిహర వీర మల్లు' జూన్ 12న విడుదల కానుంది. ఈ మేరకు పోస్ట్ ప్రొడక్షన్ పనులు చకచకా పూర్తి చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం పాన్ ఇండియా లెవల్లో విడుదల చేస్తున్నారు. థియేటర్ విడుదల తరువాత అమెజాన్ ప్రైమ్ వీడియో లో స్ట్రీమింగ్ కానుంది. సినిమా పూర్తిగా గ్రాఫిక్స్, విఎఫ్ఎక్స్ పరంగా భారీ స్థాయిలో తెరకెక్కించారు. గ్రాండ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించడానికి డిజైన్ చేసిన ఈ చిత్రం ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది.



## 'రామాయణం'లో హాలీవుడ్ యాక్షన్ ఫీస్ట్..

కేజీఎఫ్ యష్ రావణుడిగా, రణ్ బీర్ కపూర్ రాముడిగా నటిస్తున్న మైథలాజికల్ డ్రామా 'రామాయణ' చిత్రీకరణలో బిజీగా ఉంది. ప్రస్తుతం యష్ కి సంబంధించిన యాక్షన్ ఎపిసోడ్లను షూట్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. 'రామాయణ' కోసం యష్ భారీ యాక్షన్ సీన్ల పై పనిచేస్తున్నారు. సినిమాకు సంబంధించిన పూర్తి యాక్షన్ సన్నివేశాలను హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ గై నోరిస్ డిజైన్ చేస్తున్నారు. ఆయన 'మ్యాడ్ మ్యాక్స్: ఫ్యూరీ రోడ్', 'ది స్యూసైడ్ స్క్వాడ్' లాంటి హిట్ సినిమాలకు స్టంట్స్ కంపోజ్ చేశారు. ఈ సీన్లు యష్ పాత్రను ప్రధానంగా తీసుకొని ప్రత్యేకంగా డిజైన్ చేశారు. దీంతో ఫ్యాన్స్ లో మరింత ఆసక్తి పెరిగింది. ఈ సినిమాలో యష్ రావణుడి పాత్రలో నటించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. అందుకే యాక్షన్, వీఎఫ్ఎక్స్ టీమ్‌తో దగ్గరగా పనిచేస్తూ సన్నివేశాలను ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. భారీ బడ్జెట్ తో, అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని బాలీవుడ్ డైరెక్టర్ నితీష్ తివారీ తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్‌పై నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఇందులో సాయి పల్లవి (సీత), సన్నీ డియోల్ (హనుమాన్), రవి దుబే (లక్ష్మణుడు), కాజల్ అగర్వాల్ (మందోదరి), లారా దత్తా (కైకేయి) పాత్రల్లో చేస్తున్నారు. 'రామాయణ' రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. 'రామాయణం పార్ట్ 1' 2026 దీపావళికి, పార్ట్ 2 2027 దీపావళికి రిలీజ్ అవుతుంది. వీఎఫ్ఎక్స్ వర్క్‌ను ఆస్కార్ విజేత స్టూడియో DNEG చేస్తోంది.




## గద్దర్ అవార్డ్స్ లో సత్తా చాటిన మైత్రీ మేకర్స్

తెలంగాణలో సినీ అవార్డుల సంబరం నెలకొంది. కొత్త రాష్ట్రం ఏర్పడిన 12ఏళ్ళ తర్వాత ప్రభుత్వం దివంగత తెలంగాణ నాయకుడు గద్దర్ పేరిట అవార్డు లను ప్రకటించింది. 2014నుంచి 2024 వరకు విడుదలైన చిత్రాలకు అవార్డులు ఇచ్చారు. మొత్తం 1248 నామినేషన్లు రాగా.. వాటిలో ఉత్తమ చిత్రాలను పరిశీలించి వాటికి అవార్డులు ప్రకటించారు. ఈరోజు 2014-2023 వరకు విడుదలైన చిత్రాలకు సంబంధించిన విజేతలను ప్రకటించగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కి అవార్డుల పంట పండింది. ఈ బ్యానర్ లో తెరకెక్కిన నాలుగు సినిమాలకు 'ఉత్తమ చిత్రం' విభాగంలో గద్దర్ అవార్డు వరించింది. 2015 నుంచి మహేష్ బాబు నటించిన 'శ్రీమంతుడు' 2016 విభాగం నుంచి ఎన్టీఆర్ జనతా గ్యారేజ్, 2018 నుంచి రామ్ చరణ్ రంగస్థలం, 2021నుంచి ఉప్పెన ఉత్తమ చిత్రాలుగా అవార్డు గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా మైత్రి మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తూ ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. మా సినిమాలను గుర్తించి వారికి ఈ గౌరవాన్ని అందించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి , గౌరవనీయులైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జ్యూరీ సభ్యులకు ధన్యవాదాలు. మా మొదటి మూడు చిత్రాలు శ్రీమంతుడు, జనతాగ్యారేజ్, రంగస్థలం.. అలాగే మా బిగ్గెస్ట్ హిట్‌లలో ఒకటైన ఉప్పెన గద్దర్ అవార్డు జాబితాలో ఉండడం చాలా ప్రత్యేకంగా అనిపిస్తుంది అంటూ ట్వీట్ చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే





**సిరికొండ, మే 30 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ భూమి పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తున్నామని తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఖానాపూర్ నియోజకవర్గానికి 200 వందల కోట్ల రూపాయల ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసిందన్నారు. పేదల రూపురేఖలను మార్చేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. కళ్యాణ లక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది

**ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి**
**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**




**ఇంద్రవెల్లి, మే 30 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలోని గిన్నెర గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తో కలసి భూమి పూజ చేసి, లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదింటి సొంతింటి కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని, అర్హుడైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు 500 రూపాయలకు గ్యాస్ అందిస్తుందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తుందని తెలిపారు. నిరుద్యోగులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్నీ అమలు చేస్తుందని అన్నారు. యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఐటీడిఎలకు 22016 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించిందని, ఉట్నూర్ పరిధిలోని ఐటీడిఏకు 12836 ఇండ్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రతి పేద గిరిజనుడికి అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డిఆర్డిఓ పిడి రాథోడ్ రవీందర్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



# మెరుగైన వైద్యం అందించాలి

**ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ఇంద్రవెల్లి, మే 30 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మమత నర్సింగ్ హోం ఆసుపత్రిని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచించారు. డాక్టర్ ధనరాజ్, ప్రవీణ్ లు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





**ప్రజాపాలనలో సాకారవమవుతున్న**

# పేదల సొంతింటి కల

**ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్**

**ఉట్నూర్, మే 30 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం పేదోడి సొంతింటి కలలను నెరవేరిచేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని హీరాపూర్ (జే) గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి, లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సబ్బండ వర్గాల ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



**ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేసిన వ్యక్తిపై**

# పోలీసులకు ఫిర్యాదు

**ఉట్నూర్, మే 30 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ పై ఎక్స్ వేదికగా అసత్య ప్రచారం చేసి అయన ప్రతిష్ఠతకు భంగం కలిగే విధంగా పోస్టులు పెట్టిన భైంసాకు చెందిన అరుణ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు దాసండ్ల ప్రభాకర్, మొహమ్మద్ మొబీన్, యాత్ కాంగ్రెస్ నాయకుడు అరకిల్ల పరమేశ్వర్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని కోరారు.

